క్లుప్తంగా

నాగండ్లలో నేత్రదానం


నేత్ర దాత కట్టా నాగమ్మ (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని నాగండ్ల గ్రామానికి చెందిన కట్టా నాగమ్మ (96) మంగళవారం మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు. రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో దాత కార్నియాలను గుంటూరు శంకర కంటి వైద్యశాల నిపుణులు డాక్టర్ సుస్మిత, శ్రీవాణి, సరోజిని సేకరించారు. కుటుంబ సభ్యులు నాగేంద్ర బాబు, జయశ్రీ, చెరుకూరి రుక్మిణిలను రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, వంకాయలపాటి శ్రీమన్నారాయణ, రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జట్టి వెంకటేశ్వర్లు, సోమేపల్లి రామ్మోహనరావు అభినందించారు.

బోర్డర్ క్రాప్‌తో శనగకు మేలు

ఆదిపూడి (కారంచేడు): శనగ చేల గట్లపై బోర్డర్ క్రాప్‌ను చేర్చుకుంటే మేలు జరుగుతుందని ఏడీఏ ఎన్. మోహనరావు అన్నారు. మంగళవారం ఆదిపూడి, తిమిడెదపాడు పరిధిలోని శనగ చేలను పరిశీలించి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శనగ చేల గట్ల మీద జొన్న సాగు చేసుకోవాలన్నారు. దీని ద్వారా సమయం, ధనం కూడా ఆదా అవుతుందన్నారు. బోర్డర్ క్రాప్‌తో పాటు, అంతర పంటలుగా జొన్న, ఆవాలు సాగుతో రైతన్నలకు మంచి దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయాధికారి కె. శివనాగప్రసాద్, వీఏఏలు, వీహెచ్ఏలు, ఆర్బీకేల వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠా మహోత్సవాలకు అంకురార్పణ


అంకురార్పణ చేస్తున్న వేద పండితులు

బల్లికురవ: మండలంలోని కొణిదెనలో వేంచియున్న వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక కళ్యాణం, నందీశ్వరుని ప్రతిష్ఠా మహోత్సవాలకు మండళవారం రుగ్వేద పండితులు టి. సత్యనారాయణ శర్మ బృందంచే అంకురార్పణ చేశారు. దీనిలో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచన, పంచగవ్య ప్రాసన, రుత్విగ్వరణ, మండపారాధన చేపట్టారు. సాయంత్రం నూతనంగా ఏర్పాటు చేయనున్న నందీశ్వర విగ్రహానికి జలాధి, క్షీరాధి, పుష్పశయ్యాది వాసాలు నిర్వహించి, లక్ష్మీ గణపతి, నవగ్రహ తదితర హోమాలను చేశారు. బుధవారం ఉదయం 8.25 గంటలకు నందీశ్వరుని ప్రతిష్ఠ స్వామివారి కళ్యాణం, గ్రామోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు.

నీటి వృథా లేకుండా సాగు


మాట్లాడుతున్న ఏఈ సాంబశివరావు

బల్లికురవ: రైతులు పంటల సాగులో నీటి వృథా లేకుండా చివరి భూముల వరకు నీరందించేందుకు సహకరించాలని భూగర్భ జల శాఖ బాపట్ల జిల్లా ఏడీ సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా పంటల సాగు, నీటి ఆదాపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆహార ధాన్యమైన వరిపంట ఆరుతడి పంటలకు ఎంత నీరు అవసరమో వివరించారు. పంటల సాగులో పెట్టుబడి వ్యయాలను తగ్గించుకుంటూ ఆధునికి వ్యవసాయ పద్ధతులను ఆవలంబించాలన్నారు. ఏపీడీ రోశయ్య, వసంతలక్ష్మి, సర్పంచ్ ఏల్చూరి శివపార్వతి హరిబాబు, ఎంపీటీసీ టి. రాహేలు, చెరువు మాజీ అధ్యక్షుడు శేషయ్య, జె. సుధాకర్ పాల్గొని మాట్లాడారు.

మార్టూరు ఎస్ఐగా కమలాకర్

మార్టూరు: మండల కేంద్రం మార్టూరు ఎస్ఐగా కె. కమలాకర్‌ను నియమిస్తూ ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎస్ఐగా బాధ్యతలు నిర్వహించిన రవీంద్రారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేయగా, అద్దంకి ఎస్ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న కమలాకర్‌ను మార్టూరు ఎస్ఐగా నియమించారు.

ప్రతి వార్డుకు సీసీ రహదారి


మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్


సన్మానం అందుకుంటున్న అధికారులు, వర్కర్లు

- కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ
- ప్లాస్టిక్ నిషేధానికి ఏకగ్రీవ ఆమోదం

అద్దంకి: ప్రాధాన్యతా క్రమంలో పట్టణంలోని ప్రతి వార్డులో సీసీ రహదారి, సీసీ డ్రైనులు నిర్మించే విధంగా పాలక వర్గం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ అన్నారు. మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశాన్ని కమిషనర్ టి. రవికుమార్ మంగళవారం నిర్వహించారు. దీనిలో భాగంగా 31 అభివృద్ధి అంశాలతో కూడిన అజెండాను సీనియర్ అసిస్టెంట్ చదివి వినిపించగా, చర్చల అనంతరం ఆమోదిస్తున్నట్లు చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ ప్రకటించారు. ఆమోదించిన అజెండాలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పట్టణంలో హోటల్స్ దుకాణాలు, ప్యాకింగ్ దుకాణాల్లో 120 మైక్రాన్‌ల మందం లోపు ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్స్, హోటల్స్ కూరల ప్యాకింగ్‌కు వాడే కవర్లు, భోజనాల సమయంలో బల్లలపై వాడే ప్లాస్టిక్ పూత పూచిన పేపర్లను తయారు చేసిన, వాడిన, విక్రయించిన వారికి జరిమానా విధించే తీర్మానం ఆమోదించారు. అదే విధంగా 13వ వార్డులో రూ.5 లక్షలతో ఒక సీసీ రహదారి, రూ.6 లక్షలతో మరో సీసీ రహదారి నిర్మాణం, 14వ వార్డులో రూ.9 లక్షలతో సీసీ రహదారి, 18వ వార్డులో రూ.10 లక్షలతో మూడు చోట్ల డ్రైనుల నిర్మాణం. 2వ, 5వ, 13వ వార్డుల్లో రూ.26 లక్షలతో సీసీ రహదారులు, 4వ వార్డులో రూ.22 లక్షలతో నాలుగు చోట్ల సీసీ రహదారులు, డ్రైన్ 5వ వార్డులో రూ.3.6లక్షలతో సీసీ రహదారి, 6వ వార్డులో రూ.2.9 లక్షలతో సీసీ రహదారి నిర్మాణానికి, 8వ వార్డులోని గొరకాయ పాలెంలో నిర్మిస్తున్న యూపీహెచ్‌సీ (అర్బన్ హెల్త్ సెంటర్ భవనం) నిర్మాణానికి అదనంగా రూ.25 లక్షలకు ఆమోదం తెలిపారు. 20వ వార్డులో రూ.2 లక్షలతో గ్రావెల్ రోడ్డు, 17వ వార్డులో రూ.6 లక్షలతో సీసీ డ్రైన్, 18వ వార్డులోని శ్మశానానికి తూర్పు పడమర వైపు రూ.15 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సున్నం కొనుగోలు, 1వ వార్డు సచివాలయం నుంచి కలవకూరు బట్టీల వరకు చిల్ల చెట్ల తొలగింపు, బోర్ల మరమ్మతులకు ఆమోదం తెలిపారు. మునిసిపల్ మేనేజర్ శ్రీదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, టీపీవో సాంబశివరావు, ఏఈ రోహిణి, వైస్ చైర్మన్‌లు దేశు పద్మేశ్, కె. అనంతలక్ష్మి, కౌన్సిలర్లు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో ఉత్తమ సేవలందించి, రిపబ్లిక్ డే రోజులన కలెక్టర్‌చే అవార్డు పొందిన, కమిషనర్ టి. రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ కృష్ణ, సచివాలయాల్లోని ముగ్గురు, శానిటేషన్ వర్కర్లు ఆదాం, బీష్మలను మునిసిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, ఘనంగా సన్మానించారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేత


మందులు, పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అధికారులు

మార్టూరు: మార్టూరు ప్రభుత్వాసుపత్రి పరిధిలో చికిత్స పొందుతున్న టీబీ పేషెంట్లకు మంగళవారం దాతలు ఆసుపత్రిలో పౌష్టికాహారం, మందుల పంపిణీ చేశారు. చీరాల వాడరేవుకు చెందిన శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్టూరు పరిసర ప్రాంతాల్లో అందించారు. కార్యక్రమంలో సూపరెంటెండెంట్ డాక్టర్ అశోక్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సుభాషిణి, డాక్టర్ భవానీ, డాక్టర్ విష్ణుతేజ, భాను చంద్ర నాయుడు పాల్గొన్నారు.

చీరాలలో కార్డెన్ సెర్చ్


పట్టుబడిన నాటుసారా సామగ్రి

చీరాల: బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ పి.శ్రీకాంత్ పర్యవేక్షణలో చీరాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్, 300 కాలనీ, ఆర్టీసీ గ్యారేజ్ ప్రాంతాల్లో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టూటౌన్ సీఐ జి.సోమశేఖర్ ఆధ్వర్యంలో చీరాల రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జున, ఐదుగురు ఎస్సైలు, 70 మంది సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నాలుగు లీటర్ల నాటుసారా, 300 లీటర్ల సారాకు ఉపయోగించే పదార్థాలను గుర్తించారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

కుష్టు వాధి నివారణ సాధ్యమే..


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

బల్లికురవ: కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తతో పాటు తగు జాగ్రత్తలతో నివారించడం సులువని 104 వైద్యాధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వెలమవారిపాలెంలో ఉచిత వైద్యశిబిరంలో భాగంగా సాయంత్రం కుష్టు వ్యాధి నివారణపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వ్యాధి సోకిన వారు భయపడాల్సిన పనే లేదని తగు మందులు వాడాలని చెప్పారు. 104 సిబ్బంది విష్ణు, డేవిడ్ పాల్గొన్నారు.

కులంపేరుతో దూషించిన వ్యక్తులపై కేసు నమోదు

చినగంజాం: కులం పేరుతో తనను దూషించారంటూ చినగంజానికి చెందిన కట్టా శ్రీనివాసరావు కోర్టులో ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశానుసారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కట్టా అనూక్ తెలిపారు. గతేడాది జూలైలో కట్టా శ్రీనివాసరావుకు చెందిన భూమిలో గున్నమనేని ప్రతాప్ కుమార్, నాగేశ్వరమ్మ, లక్ష్మయ్య, మల్లిఖార్జున, సోమయ్య ప్రవేశించి అక్కడ నాటిన మొక్కలను నరికివేశారు. ఇదేమని శ్రీనివాసరావు ప్రశ్నించడంతో వారు కులం పేరుతో దూషించారు. తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాసరావు కోర్టుకు ఫిర్యాదు చేశాడు. కోర్టు కేసు విచారణ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అందె కస్తూరి బాయి మృతి


అందె కస్తూరి బాయి

చీరాల: మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ అందె కస్తూరి బాయి (76) మంగళవారం పేరాలలోని ఆమె నివాసంలో మరణించారు. కొంత కాలంగా అస్వస్థతకు గురైన పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆమె భర్త అందె నరసింహారావు చీరాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. భార్యభర్తలిద్దరూ కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. 2000లో టీడీపీ అధికారంలో ఉండగా కాంగ్రెస్ పార్టీకి తక్కువ కౌన్సిల్ స్థానాలు రాగా.. చైర్మన్ ఎన్నికలో మాత్రం ఆమె చైర్ పర్సన్‌గా ఎన్నికయ్యారు. మంచి పాలన అందించి అందరి మన్ననలు పొందారు. ఆమె మరణం పట్ల పలువురు పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

శింగరకొండ దర్శిని


అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూల విరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం మాఘ మాసం మృగశిర నక్షత్రం ఏకాదశి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర మంగళవారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఆలయాల్లో చోరీ

బల్లికురవ: పథకం ప్రకారం మండలంలోని చెన్నుపల్లి అంకమ్మతల్లి ఆలయం, కొండాయపాలెం పోలేరమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు ఆలయం తలుపులకు వేసిన తాళం పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. చెన్నుపల్లి ఆలయంలోని హుండీలో ఉంచి రూ.50 వేల నగదు తస్కరించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. కొండాయపాలెం గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో దొంగలు తాళం తెరచి లోనికి ప్రవేశించినా హుండీ తెరచుకోకపోవడంతో పలాయనం చిత్తగించారు. చెన్నుపల్లి ఆలయ కమిటీ మంగళవారం బల్లికురవ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్సై వి. వేమన మాట్లాడుతూ ఆలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు విలువైన వస్తువులను ధర్మకర్తలు తమ ఆధీనంలో ఉంచుకోవాలని ఆలయాల్లో ఉంచవద్దని, హుండీల్లోనూ నగదును తీసి భద్రపరుచుకోవాలని సూచించారు.

3న పటిష్ట బందోబస్తు

సంతమాగులూరు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈ నెల 3న ఎంపీపీ ఎన్నిక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో సాంబశివరావు మంగళవారం తెలిపారు. బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు, సర్కిల్ అధికారి కార్యాలయం వారు పర్యవేక్షిస్తారని చెప్పారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ కాశీవిశ్వనాథ్

వేటపాలెం: ప్రభుత్వ లైసెన్సు పొందిన ఎరువులు షాపుల యజమానులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి ఐ. కాశీవిశ్వనాథ్ తెలిపారు. స్థానిక ఎరువుల షాపులను మంగళవారం పరిశీలించారు. షాపుల్లో నిల్వ ఉన్న ఎరువులు, రికార్డులో నమోదు చేసిన ఎరువులను సరి చూశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

అద్దంకి: శింగరకొండ దేవస్థానంలో బుధవారం ఉదయం 9 గంటలకు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఈవో సుభద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.65.61లక్షల నిధులతో మారుతి భవన్ వసతి గదుల ఆధునీకీకరణ, రూ.45 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం, రూ.34 లక్షలతో మాడ వీధులు ఏర్పాటు, రూ.15 లక్షలతో కార్యాలయ భవనానికి ముందర సీసీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

స్పర్శ యోజన స్కాలర్‌షిప్‌నకు బూదవాడ విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం అనిత, ఉపాధ్యాయులు

జె.పంగులూరు: పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అక్టోబర్ దీన్ దయాదళ్ స్పర్శ యోజన స్కాలర్ షిప్ పరీక్ష నిర్వహించినట్లు బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అనిత మంగళవారం తెలిపారు. ఈ పరీక్షలో బూదవాడ పాఠశాలకు చెందిన ముగ్గురు బి. దివ్య, ఎం. సిరివల్లి, షేక్ గౌస్ బాషాలు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రం మొత్తం మీద 24 మంది ఎంపిక కాగా వారిలో బూదవాడ పాఠశాల నుంచి ముగ్గురు ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు త్వరలో విజయవాడలో జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రి చేతుల మీదగా ఒక్కొక్కరికి రూ. 6 వేలు నగదు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

పిచ్చి కుక్క స్వైర విహారం


పంగులూరు గ్రామంలో పట్టుకున్న పిచ్చికుక్క

జె.పంగులూరు: మండల కేంద్రమైన పంగులూరులో గత 20 రోజులుగా పిచ్చికుక్క దాదాపు 25 మందిని కరిచింది. ఈ దెబ్బకు రోడ్డు మీదకు రావాలంటే గ్రామస్తులు భయపడిపోయారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మంగళవారం కుక్కలు పట్టుకునే వారిని పిలిపించి దానిని పట్టుకొని ఊరికి దూరంగా వదిలిపెట్టినట్లు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం రామారావు తెలిపారు. దీనితో పాటు మరికొన్ని కుక్కలు గ్రామంలోకి వచ్చినట్లు తెలిపారు. వాటిని కూడా రెండు మూడు రోజుల్లో పట్టుకొని గ్రామానికి దూరంగా వదిలిపెడతామని తెలిపారు. వారం రోజుల క్రితం పంగులూరులోని యస్‌బీఐ బ్యాంకు వద్ద సుమారు 15 మందిని కరిచిందని, మూడు రోజులుగా పెద్ద బజారు నుంచి లైబ్రరీ వెళ్లే దారిలో సుమారు 7 మందిని కరిచిందని తెలిపారు. రెండు రోజుల్లో పరిష్కరించినందుకు సర్పంచ్‌కి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మేదరమెట్ల: కొరిశపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలో గల మూడు మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టులకు ఈనెల 10వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో కృష్ణకుమారి తెలిపారు. కొరిశపాడు మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు రెండు, హెల్పర్‌లు 5, జే.పంగులూరు మండలంలో ఒక కార్యకర్త, 11 హెల్పర్ పోస్టు, అద్దంకి మండలంలో 5 కార్యర్తలు, 17 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

బల్లికురవ, అద్దంకి: సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బల్లికురవ, సంతమాగులూరు, యద్దనపూడి, మార్టూరు మండలాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతమాగులూరు మండలం.. పాతమాగులూరు ఎస్సీ -1లో కార్యకర్త, కొమ్మాలపాడు మైనారిటీ, వెల్లలచెరువు మెయిన్ సెంటర్‌లో ఆయా పోస్టులు, బల్లికురవ మండలంలోని కె. మల్లాయపాలెంలో ఆయా పోస్టు, యద్దనపూడి మండలంలోని సూరవరపుపల్లి మెయిన్ సెంటర్‌లో కార్యకర్త, యనమదల మెయిన్ సెంటర్‌లో ఆయా, మార్టూరు మండలం నాగరాజుపల్లి మెయిన్‌లో ఆయా, మార్టూరు క్వారీ గుంటలు -2లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చీరాల అర్బన్: ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టులోని వీఎస్ఆర్ నగర్, రామానగర్‌లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ టి. ఝాన్సీ మంగళవారం తెలిపారు. వీఎస్ఆర్ నగర్ కేంద్రానికి ఓసీ, రామ్‌నగర్ కేంద్రానికి ఎస్టీ రిజర్వేషన్ ప్రకారం కేటాయించినట్లు తెలిపారు.